క్లుప్తంగా

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థిని ప్రశాంతిని అభినందిస్తున్న దృశ్యం

టి.నరసాపురం : బాలికలు క్రీడలపై పెంచుకోవాలని మక్కినవారిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.ప్రసాద్ అన్నారు. శనివారం పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ జనవరి 11, 12, 13 తేదీల్లో విజయనగరం జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి అండర్–17 బాలికల కబడ్డీ పోటీలకు పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థిని పి.ప్రశాంతి ఎన్నికైందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రశాంతి ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రశాంతి, పీడీ ఎస్.ప్రభాకర్‌ను హెచ్‌ఎం ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ టి.నాగమణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బడేటి శ్రీనివాస్, అతని స్నేహితులు రూ.50 వేల విలువ చేసే కూరగాయలను ఆలయ ఏఈఓ కేవీఎస్ రాజుకు శనివారం విరాళంగా అందజేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం

బుట్టాయగూడెం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ప్లాస్టిక్ నిషేధంపై శనివారం స్థానిక సచివాలయ ఉద్యోగులు బుట్టాయగూడెంలో ప్రచారం నిర్వహించారు. సచివాలయ సెక్రటరీ తెల్లం సూరిబాబు ఆధ్వర్యంలో ప్రతి షాపునకు తిరుగుతూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. ఈ నిషేధాన్ని ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందని చెప్పారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు

మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి



మున్సిపల్ సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం : ప్రాధాన్యత క్రమంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్‌లు ఏవీ రమణమూర్తి, పీపీఎస్‌చంద్రరావు, నేట్రు సుబ్బలక్ష్మి, రమాదేవి, వలవల తాతాజీ, కంచర్ల గీతాకుమారి తదితరులు మాట్లాడుతూ అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. కొన్ని వార్డుల్లో పనులు జరగడం లేదని ఆరోపించారు. ఏడాది కాలంలో పనులు ప్రతిపాదించినా జరగడం లేదని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చామని, కనీసం ఆ హామీలకు సంబంధించిన పనులు కూడా జరగడం లేదన్నారు. దీంతో చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కమిషనర్ పి.భవానీప్రసాద్ మాట్లాడుతూ కొన్ని పనులు చేపట్టడానికి సిబ్బంది, అధికారులు కొరతగా ఉన్నారని, ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియామకాలు జరపాలని ప్రభుత్వానికి తాను, చైర్‌పర్సన్ కూడా రాశామన్నారు. అలాగే పట్టణంలో పారిశుద్ధ్యం పూర్తిస్థాయిలో చేపట్టాలని, మంచినీటి సమస్య పరిష్కరించాలని, కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్‌ల సమస్యలు ఉన్నాయని వాటిని కూడా త్వరితగతిన చేపట్టాలని సభ్యులు కోరారు. వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, కౌన్సిలర్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలు ఇవే

- పట్టణంలో రూ.15 లక్షలతో వార్డు సచివాలయాలకు వీధి లైట్ల ఏర్పాటు.
- పట్టణంలో సచివాలయాల విద్యుత్ లైట్లు ఏర్పాటుకు 100 విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు సాధారణ నిధులు రూ. 20 లక్షలు.
- పట్టణంలో రూ.115.8 లక్షలతో వివిధ వార్డుల్లో సీసీరోడ్ల నిర్మాణం.
- బైనేరు వద్ద గల కంపోస్టు యార్డు చుట్టూ రూ.5 లక్షలతో ఐరన్ షీట్‌తో కాంపౌండ్ వాల్ నిర్మాణం.
- వార్డు సచివాలయాల మంచినీటి సరఫరా కోసం రూ.2.50 లక్షలతో విద్యుత్ సామగ్రి కొనుగోలు.
- పట్టణంలో వివిధ వార్డుల్లో రూ.98.3 లక్షలతో సీసీ డ్రెయిన్‌ల నిర్మాణం.
- 3వ వార్డులో రూ. 6 లక్షలతో సీసీ కల్వర్టు నిర్మాణం.

సేవాభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : ప్రభుత్వం నూతనంగా నియమించిన సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్‌లు సేవా దృక్పథంతో పనిచేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెంలోని డీసీసీబీ కల్యాణ మండపంలో శనివారం నూతన సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ మరింత పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేయడానికి గ్రామ సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్లను భాగస్వాములు చేసినట్లు చెప్పారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, జీలుగుమిల్లి మండల వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్న బాలరాజు

కొయ్యలగూడెం : పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కొయ్యలగూడెంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకల్లో శనివారం సాయంత్రం పాల్గొన్నారు. బొల్లి పోము కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రజలంతా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కేఎఫ్‌సి షాపును ప్రారంభించి ప్రజా ప్రతినిధులతో కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, మంతెన సోమరాజు, నూకల రాము, ఘంటసాల సాయి, ఘంటసాల మధు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ల ద్వారా 1355 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్

చింతలపూడి : లోక్‌అదాలత్‌ల ద్వారా 2022వ సంవత్సరంలో చింతలపూడి కోర్టులో 1355 కేసులు పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ తెలిపారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ కేసుల్లో రూ.1,52,58,217 వసూలు చేసినట్లు చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. జనవరి నుంచి ప్రతి రోజు కోర్టులో ఫ్రీ లోక్‌అదాలత్‌లు నిర్వహించి కేసులను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కోర్టులో పెండింగ్ ఉన్న కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లు దోహదపడతాయన్నారు. జాతీయ లోక్ అదాలత్‌పై విస్తతంగా ప్రచారం నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. చిన్న, చిన్న తగాదాలను రాజీ చేసుకుని కక్షలకు దూరంగా ఉండాలని కోరారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. సమాచారం కోసం దగ్గరలోఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు



గోదారంగనాథస్వామికి సారెను సమర్పించిన భక్తులు

జంగారెడ్డిగూడెం : పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం శనివారం కావడంతో స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి వారికి తెల్లవారుజాము నుంచి ధనుర్మాసం గోదామ్మవారి విశేషా ప్రవచనం, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదాగోష్ఠి తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడుకు చెందిన భక్తులు, వికాసి తరంగిణి సభ్యులు శ్రీ గోదారంగనాదుడు స్వామి వారికి సారె సమర్పించారు. శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు మాదాల రామమోహనారావు, దమయంతి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమారాచార్యులు పాశురాలను పఠించారు. కాగా సోమవారం ఉదయం 5 గంటలకు ఉత్తర ముఖంగా ద్వారదర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో పి.జగపతిరాజు, దండు దనరాజు, రెడ్డి రంగప్రసాద్, మాదల రామోహనారావు, కె.బాలకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జెడ్పీ సీఈవోకు వినతి



జెడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ గీతావాణి

కుకునూరు : మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కుక్కునూరు ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు జెడ్పీ సీఈవో రవికుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఏలూరులో జరిగిన జిల్లా పరిషత్ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీలు గోదావరి వరదల వల్ల మూతబడిన ఆసుపత్రిని బాగు చేయాలని, మండలంలోని పాఠశాలల్లో టీచర్ల కొరతను పరిష్కరించాలని, గోదావరి వరదతో నీట మునిగిన ఇళ్లకు రూ.10 వేల నష్టపరిహారాన్ని బాధితుల ఖాతాల్లో జమ చేయాలని, కరోనా వైరస్ మరోసారి విస్తరిస్తున్న నేపథ్యంలో పాఠశాల విద్యార్థులకు మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేయాలని, 45 కాంటూరు పరిధిలో రహదారులను బాగు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు.

పాశ్చాత్య సంస్కృతిని విడనాడాలి

బుట్టాయగూడెం : అమెరికన్ సామ్రాజ్యవాద విష సంస్కృతిని వ్యతిరేకించాలంటూ పీవైఎల్, పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ, అరుణోదయ ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో శనివారం ఆయా సంఘాల నాయకులు ర్యాలీలు నిర్వహించారు. పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ సమాజంలో డిసెంబర్ 31 పేరుతో అమెరికా పాశ్చాత్య విష సంస్కృతిని పాలక వర్గాలు అవలంభిస్తున్నాయని ఆ పేరుతో దేశంలోని యువత పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ మందు, చిందులు వంటి పనులు చేయడం బాధాకరమని అన్నారు. ఈ సంస్కృతిని విడనాడాలని పిలుపునిచ్చారు.

రేపు నిరసన ర్యాలీ

జంగారెడ్డిగూడెం రూరల్ : అయ్యప్ప స్వామిపై బైరి నరేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ జనవరి 2 సోమవారం ఉదయం 10 గంటలకు నిరసన ర్యాలీ చేబడుతున్నట్లు గురవాయిగూడెం అయ్యప్ప స్వామి దేవస్థానం ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. శనివారం గురవాయిగూడెం అయ్యప్పస్వామివారి దేవస్థానంలో అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు, మాల ధరించిన స్వాములు మాట్లాడుతూ గురవాయగూడెం అయ్యాప క్షేత్రం నుంచి నిరసన ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

నూతన సంవత్సరానికి స్వాగతం

బుట్టాయగూడెం : 2022కు వీడ్కోలు పలుకుతూ 2023 కొత్త సంవత్సరానికి అన్నివర్గాల ప్రజలు స్వాగతం పలికారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత యువత నూతన సంవత్సర శుభాకాంక్షలు అంటూ నినాదాలు చేశారు. మిఠాయిలు పంచుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మరొపక్క చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కాగా శనివారం సాయంత్రం బ్యాకరీలు, పండ్లు, పూల దుకాణాలు కిటకిటలాడాయి.